క్లుప్తంగా

ఎన్‌సీసీ ట్రెక్కింగ్‌కు ఎంపిక



జడ్చర్ల టౌన్‌: మహారాష్ట్ర కొల్హాపూర్‌లో జరిగే శివాజీ ఆల్‌ ఇండియా ట్రెక్కింగ్‌ క్యాంపునకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు క్యాడెట్లు ఎంపికైనట్లు ఎన్‌సీసీ లెఫ్టినెంట్‌ అధికారి యాదయ్య ఆదివారం తెలియజేశారు. వారం రోజుల పాటు కొనసాగే క్యాంపులో ఎన్‌సీసీ క్యాడెట్లు యుగంధర్‌, లోకేష్‌, హరీష్‌, వంశీ ఎంపికైన వారిలో ఉన్నారు. హైదరాబాద్‌ గ్రూప్‌ 102మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లకు తాను కాంటినెంట్‌ కమాండర్‌గా బాధ్యత వహిస్తున్నట్లు తెలిపారు. ఎంపికైన వారిని ప్రిన్సిపాల్‌ డా.అప్పియా చిన్నమ్మ, అధ్యాపక బృందం అభినందించింది. కళాశాలలోని తన చాంబర్‌లో క్యాడెట్లతో మాట్లాడుతూ క్యాంపులో రాణించి రాష్ట్రానికి పేరు తీసుకురావాలని సూచించారు.

పోలింగ్‌ కేంద్రాల్లో ర్యాంపుల ఏర్పాటు



నవాబుపేట: పోలింగ్‌ కేంద్రాల వద్ద ర్యాంపులు ఉన్న పాఠశాలలను అధికారులు ఎంపిక చేశారు. మండలంలో మొత్తం 53 పోలింగ్‌ కేంద్రాలకు 18 కేంద్రాల్లో ర్యాంపులు ఉన్నాయి. గతంలో 43 పోలింగ్‌ కేంద్రాలకు గాను తాజాగా 10 కేంద్రాలు అదనంగా ఏర్పాటు చేశారు. దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు కల్పించాలని, మహిళ ఓటర్లకు ప్రత్యేక పోలింగ్‌ కేంద్రాల్లో మూత్రశాలల నిర్మాణం సైతం చేపట్టనున్నారు. మండలంలో 39,953 మంది ఓటర్లు ఉండగా వారిలో 19,672 మంది మహిళలు, 20,281 మంది పురుషులు ఉన్నారు.

థియేటర్‌లో క్రికెట్‌ మ్యాచ్‌ ప్రదర్శన



జడ్చర్ల టౌన్‌: వన్డే ప్రపంచ కప్‌ ఫైనల్‌ మ్యాచ్‌ను అభిమానుల కోరిక మేరకు పట్టణంలోని థియేటర్‌లో ప్రద ర్శించారు. మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కెప్టెన్‌ రోహిత్‌ శర్మ బ్యాటింగ్‌ చేస్తున్నంతసేపు ప్రేక్షకులు ఈలలు వేస్తూ ఉత్సాహంగా గడిపారు. ఆదివారం కావటం ప్రపంచకప్‌ ఫైనల్‌ మ్యాచ్‌ ఉండటంతో యువకులు, చిన్నారులు ఇళ్లలో టీవీ ముందు కూర్చోవటంతో పట్టణంలోని ప్రధాన రోడ్లు వెలవెలబోయాయి. వివాహాలు ఉండటంతో వారు మాత్రమే రోడ్లపైకి వచ్చారు.

టీవీలకు అతుక్కుపోయిన జనం

మహబూబ్‌నగర్‌ క్రీడలు: ఆదివారం ఇండియా–ఆస్ట్రేలియా వరల్డ్‌కప్‌ ఫైనల్‌ మ్యాచ్‌ను పురస్కరించుకుని పాలమూరు పట్టణంలో జనం టీవీలకు అతుక్కుపోయారు. మ్యాచ్‌ సందర్భంగా మధ్యాహ్నం నుంచి పాలమూరు పట్టణంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌ డిస్ట్రిక్ట్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో స్థానిక పిల్లలమర్రి సమీపంలోని క్రికెట్‌ మైదానంలో ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్‌ ఏర్పాటు చేశారు. క్రీడాకారులు మైదానంలో జాతీయ జెండాలతో సందడి చేశారు.

సర్వమతాల సారాంశం ఒక్కటే

నారాయణపేట: స్థానిక కొల్లంపల్లిలో హజ్రత్‌ సయ్యద్‌ షా అహ్మద్‌ ఖతాల్‌ హుస్సైనీ వార్షిక ఉర్సును ఆదివారం ఆప్రషియా ఎడ్యుకేషన్‌ సొసైటీ కొల్లంపల్లి ఆధ్వర్యంలో సర్వధర్మ సమ్మేళనం నిర్వహించారు. ధార్మిక సదస్సుకు సయ్యద్‌షా మహ్మద్‌ హుస్సైనీ సూఫీ సజ్జాద్‌ నాషిన్‌ గోగి షరీఫ్‌ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎస్‌.రాజేందర్‌రెడ్డితో పాటు వక్తలు మాట్లాడారు. ప్రతి ఒక్కరూ మతాన్ని గౌరవించుకోవాలని ఇలాంటి సదస్సుల ద్వారా సర్వమతాల ఐక్యత పెంపొందుతుందని వక్తలు అన్నారు.

అభ్యర్థుల ప్రచారం

⇨ అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్‌ పార్టీ పాటుపడుతుందని మహబూబ్‌నగర్‌ ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. యెన్నం సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌పార్టీలో చేరారు.

⇨ సీఎం కేసీఆర్‌ను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని పరిగి కాంగ్రెస్‌ అభ్యర్థి టీఆర్‌ఆర్‌ సతీమణి ఉమా తెలిపారు. ఆదివారం మహమ్మదాబాద్‌ మండలం కంచన్‌పల్లి, ఎన్కిచెరువు, జగ్గంపల్లి గ్రామాల్లో ఆమె ప్రచారం చేశారు.

నేడు పాలమూరుకు ఈటల

పాలమూరు: మహబూబ్‌నగర్‌ నియోజకవర్గానికి సోమవారం ఈటల రాజేందర్‌ రానున్నారు. బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి ప్రచార కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 12:30గంటలకు హన్వాడలో కార్నర్‌ మీటింగ్‌లో పాల్గొంటారు. ఆ తర్వాత మధ్యాహ్నం 2:30 గంటలకు జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్‌ చౌరస్తాలో కార్నర్‌ మీటింగ్‌లో పాల్గొని ప్రసంగిస్తారు.

వేలాది మందికి ఉద్యోగావకాశాలు

- రాష్ట్ర ఎక్సైజ్‌, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌
- మద్దతు పలికిన టీఎఫ్‌టీయూ, ఇతర సంఘాలు



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు

మహబూబ్‌నగర్‌ మున్సిపాలిటీ: విదేశీ కంపెనీల ద్వారా దివిటిపల్లిలోని ఐటీ టవర్‌లో వేలాది మంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని రాష్ట్ర ఎక్సైజ్‌, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రం లోని బీఆర్‌ఎస్‌ కార్యాలయం, మినిస్టర్‌ క్యాంపు కార్యాలయంలో హన్వాడ మండలం కొత్తపేటకు చెందిన బీజేపీ నాయకులు, స్థానిక 19, 29వ వార్డుల పరిధిలోని టీచర్స్‌కాలనీకి చెందిన కాంగ్రెస్‌ నాయకులు, వీరన్నపేట- హీరాబాయి దాడితండాకు చెందిన కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు సుమారు వంద మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి యువత కోసం కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు చేసిందేమీ లేదన్నారు. తెలంగాణ వచ్చిన తర్వాతే విద్య, ఉద్యోగ రంగాల్లో ఎంతో పురోగతి సాధించామన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేస్తే జీవితాలు ఆగమే

మహబూబ్‌నగర్‌ రూరల్‌: తమది గొప్ప పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్‌ ఈ దేశాన్ని, రాష్ట్రాన్ని ఏళ్ల కొద్ది పాలించి చీకటి బతుకులు చేసిందని, ఒక్క అభివృద్ధి చేయలే, ప్రజలకు సమస్యలు తప్ప, సంతోషం లేకుండా చేసి ఇప్పుడు మళ్లీ గ్యారంటీలంటూ అసత్య ప్రచారం చేస్తూ జనాలను మభ్యపెడుతుందని మహబూబ్‌నగర్‌ అసెంబ్లీ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌ అన్నారు. కాంగ్రెస్‌ చెప్పే మాటలను నమ్మి ఓటేశారో జీవితాలు ఆగమవుతాయి, రాష్ట్రం కుక్కలు చింపిన విస్తరే అవుతుందని హెచ్చరించారు. ఆదివారం మండలంలోని దివిటిపల్లి, అంబటిపల్లిలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్‌ వస్తే రాష్ట్రం పదేళ్లు వెనక్కి వెళ్తుందని, మళ్లీ చీకటి కష్టాలు మొదలవుతాయని, పథకాలు బందైపోతాయని చెప్పారు. తన జీవితం ప్రజా సేవకే అంకితమని, ప్రజల కోసమే అనునిత్యం పని చేస్తున్నానని అన్నారు. బీఆర్‌ఎస్‌తోనే రాష్ట్రం పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతుందని ప్రజలకు పూర్తి స్థాయిలో సంక్షేమ ఫలాలు అందుతున్నాయని తెలిపారు. రైతులకు 3 గంటల కరెంట్‌ చాలని రేవంత్‌రెడ్డి బాహాటంగానే చెబుతున్నారని, సాగుకు మూడు గంటలు చాలా అని ప్రశ్నించారు. ఇంకా 10 హెచ్‌పీ మోటార్లు పెట్టుకొని సాగునీరు పారించుకోవాలని అంటున్నాడని, ఇది సాధ్యమవుతుందా అని ప్రశ్నించారు. ఇటువంటి కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం అధోగతి పాలవుతుందని అన్నారు. 24 గంటల కరెంట్‌ కావాలంటే, అభివృద్ధి, సంక్షేమం కావాలంటే బీఆర్‌ఎస్‌కు ఓటు వేయాలని సూచించారు. స్వరాష్ట్రంలో గణనీయమైన అభివృద్ధిని సాధించామని, ప్రజలకు న్యాయం కలుగుతుందని చెప్పారు. ముఖ్యంగా దేశానికి అన్నం పెట్టే రైతన్న జీవితాన్ని బాగు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు. తన పదవి కాలంలో ఈ ప్రాంతం అభివృద్ధికి ఎంతో చేశానని, ప్రజలు మళ్లీ ఆశీర్వదించి గెలిపించాలని, పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తానని మంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్‌, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పి.చంద్రశేఖర్‌, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌ రాజేశ్వర్‌గౌడ్‌, ఎంపీపీ సుధాశ్రీ, జెడ్పీటీసీ సభ్యురాలు వెంకటేశ్వరమ్మ, వైస్‌ ఎంపీపీ అనిత, ఆంజనేయులు, జరీనాబేగం, రాఘవేందర్‌గౌడ్‌, శ్రీనివాస్‌యాదవ్‌, చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

మరో 10 గిగా పరిశ్రమలు తెస్తాం

అమరరాజా లిథియం అయాన్‌ గిగా పరిశ్రమ లాంటివి మరో పది కంపెనీలను ఇక్కడికి తీసుకొస్తామని మంత్రి చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ కార్మిక సంఘాల సమాఖ్య (టీఎఫ్‌టీయూ) కార్యాలయంలో సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఆయనకు ఈ ఎన్నికల్లో మద్దతు పలుకుతున్నట్లు ప్రకటించి ఘనంగా సన్మానించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ పేదలను అన్ని విధాలా ఉన్నత స్థానానికి తీసుకురావడమే తమ ధ్యేయమన్నారు. నియోజకవర్గంలో అన్ని సంఘాలకు స్థలాలతో పాటు భవనాలు నిర్మించుకునేలా నిధులు కేటాయించామన్నారు. ఐదు అంతస్తుల్లో వెయ్యి పడకల సూపర్‌ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. ఈ పదేళ్లుగా ఎలాంటి మతకలహాలకు తావు లేకుండా చేశామన్నారు. అలాగే ఆటో డ్రైవర్ల యూనియన్‌ అధ్యక్షుడు ఆంజనేయులు, గ్లాస్‌ వర్కర్స్‌ యూనియన్‌ అధ్యక్షుడు చక్రవర్తి, పట్టణ పేదల సంఘం అధ్యక్షురాలు జుబేదా ఖాతున్‌ తమ సంఘాల తరపున మంత్రికి మద్దతునిస్తున్నామని ప్రకటించారు.



జిల్లా కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌



దివిటిపల్లిలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌

అవినీతి బీఆర్‌ఎస్‌ను ఓడించాలి



కోటకదిరలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌ రూరల్‌: రాష్ట్రంలో పదేళ్ల అధికారంలో ఉన్న అవినీతి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కోటకదిర, పోతన్‌పల్లిలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని పిల్లల భవిష్యత్‌ బాగుండాలంటే బీజేపీ అధికారంలోకి రావాలని అన్నారు. ప్రతి ఒక్కరు కమలం పువ్వుకే ఓటు వేయాలని కోరారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే పేదలకు ఏడాదిలో ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చారు. తాను కమీషన్ల కోసమో, లంచాల కోసమో, భూముల కబ్జాల కోసమో రాజకీయాల వైపు రాలేదని, ప్రజా సేవ కోసమే పోటీలో ఉన్నానని తెలిపారు. ప్రజాసేవ చేయడం తన లక్ష్యమని అన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పేదలను పట్టించుకోలేదని, పట్టణ అభివృద్ధి అనుకున్న విధంగా కాలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి పాండురంగారెడ్డి, రాజుగౌడ్‌, మహేష్‌గౌడ్‌, కిరణ్‌కుమార్‌రెడ్డి, జాం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులు

భూత్పూర్‌: పట్టణానికి చెందిన మైనార్టీ, అమిస్తాపూర్‌, మండలంలోని కప్పెటకు చెందిన యువకులు ఆదివారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరారు. పట్టణంలోని మున్సిపల్‌ చైర్మన్‌ బస్వరాజ్‌ గౌడ్‌ నివాసంలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణానికి చెందిన మైనార్టీ యువకులు 30 మంది, అమిస్తాపూర్‌కు చెందిన బీజేపీ, కాంగ్రెస్‌ నాయకులు వైస్‌ ఎంపీపీ నరేష్‌గౌడ్‌ ఆధ్వర్యంలో పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నారాయణగౌడ్‌, చంద్రశేఖర్‌గౌడ్‌, మహ్మద్‌ సాధిక్‌, ఖదీర్‌, జహంగీర్‌, నయ్యూం, కప్పెట సర్పంచ్‌ వేణుగోపాల్‌, సత్యం, దామోదర్‌, గుంత రాజు, తిరుపతి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్‌ చెప్పే గాలి మాటలను నమ్మొద్దు



హౌసింగ్‌బోర్డు కాలనీలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: అధికారం దక్కించుకునేందుకు కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చే అమలు కాని హామీలను చూసి ప్రజలు మోసపోవద్దని, కాంగ్రెస్‌ నేతలు చెప్పే గాలి మాటలను నమ్మొద్దని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన స్థానిక హౌసింగ్‌బోర్డు, వెంకటేశ్వరకాలనీలలో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలను చేసి ప్రజలను గందరగోళంలోకి నెట్టి లబ్ధిపొందాలని చూస్తున్నారని తెలిపారు. కరెంటు, తాగునీళ్లు, పింఛన్లు, రైతు బంధు, రైతు బీమా తదితర అభివృద్ధి, సంక్షేమ పథకాలు తమ ప్రభుత్వం ద్వారానే సాధ్యమన్నారు. ఏమాత్రం కాంగ్రెస్‌ పార్టీని నమ్మినా మళ్లీ రాష్ట్రంలో కరెంట్‌ కోతలు పెరిగి చీకటి మయం తప్పదని, రైతులకు కన్నీళ్లు మాత్రమే మిగులుస్తారని అన్నారు. ఎన్నికలలో బీఆర్‌ఎస్‌కు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

మోడల్‌ పోలింగ్‌ కేంద్రాల ఎంపిక



పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రిటర్నింగ్‌ అధికారి

జడ్చర్ల టౌన్‌: ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో మోడల్‌ పోలింగ్‌ కేంద్రాలను ఆదివారం ఎంపిక చేశారు. మున్సిపాలిటీ పరిధిలోని తెలుగు మీడియం స్కూల్‌లో మోడల్‌ పోలింగ్‌ కేంద్రంగా ఎంపిక చేశారు. ఇందిరానగర్‌లోని పాఠశాలలో యువజన కేంద్రంగా, బాదేపల్లి జెడ్పీహైస్కూల్‌లో దివ్యాంగుల కేంద్రంగా, సెయింట్‌ ఆగ్నేస్‌ స్కూల్‌లో మహిళా పోలింగ్‌ కేంద్రంగా ఎంపిక చేశారు. నాలుగు కేంద్రాలను ఆదివారం అసెంబ్లీ రిటర్నింగ్‌ అధికారి మోహన్‌రావు, అసిస్టెంట్‌ రిటర్నింగ్‌ అధికారి శ్రీనివాసులు పరిశీలించారు. నిబంధనల మేరకు ఆయా కేంద్రాలలో ఎన్నికల నాటికి పూర్తిస్థాయిలో మోడల్‌ పోలింగ్‌ కేంద్రాలుగా అభివృద్ధి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని రిటర్నింగ్‌ అధికారి బీఎల్‌ఓలకు సూచించారు.

దేశాభివృద్ధి కోసం ఇందిరాగాంధీ కృషి



ఇందిరమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: దేశాభివృద్ధి కోసం దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ విశేష కృషి చేశారని టీపీసీసీ ఉపాధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్‌ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్‌ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఇందిరాగాంధీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కొత్వాల్‌ మాట్లాడుతూ ఇందిరాగాంధీ తన హయాంలో బ్యాంకులను జాతీయం చేయడం, రాజాభరణాలను రద్దు చేయడంలాంటి సాహసోపేత నిర్ణయాలు తీసుకున్నారని కొనియాడారు. భూసంస్కరణల ద్వారా పేదలకు ఉచితంగా భూములు పంచిపెట్టిన ఘనత ఆమెకే దక్కిందని అన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు సంజీవ్‌ ముదిరాజ్‌, వినోద్‌కుమార్‌, చంద్రకుమార్‌గౌడ్‌, సీజే బెనహర్‌, సిరాజ్‌ ఖాద్రీ, చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

జాయమ్మ చెరువు నింపి.. రైతుల పాదాలు కడుగుతా



నారాయణపేటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: రైతాంగానికి ఎన్నో ఏళ్ల నుంచి కలగంటున్నా జాయమ్మ చెరువుకు పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నీరు నింపి ప్రతి ఎకరాకు సాగునీరు అందించి రైతుల పాదాలు కడగడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే ఎస్‌.రాజేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం మండలంలోని పేరపళ్లలో ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామంలో వచ్చి పోయే ఆటోలోని ప్రయాణికులు పలకరించారు. ఈ సారైనా పేరపళ్ల జాయమ్మ చెరువుకు సాగునీరు వస్తుందా అంటూ రైతులు ఎమ్మెల్యే ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి లైన్‌ క్లియర్‌ అయ్యిందని.. త్వరలోనే కాల్వల తవ్వకాలు పూర్తయ్యి ఏడాదిలోపే చెరువుకు కానుకుర్తి ఎత్తిపోతల రిజర్వాయర్‌ నుంచి నీరు తీసుకువచ్చేందుకు ప్రణాళికలు రూపొందించామని తెలిపారు.

సంపద పెంచాలే..

ప్రజలకు పంచాలన్నదే కేసీఆర్‌ లక్ష్యం

రాష్ట్రంలో అన్ని రంగాల్లో సంపద పెంచి నిరుపేదలకు పంచాలన్నదే సీఎం కేసీఆర్‌ లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని భీమండికాలనీలో ఎమ్మెల్యే ఎస్‌ఆర్‌రెడ్డి తరపున ఇంటింటి ప్రచారాన్ని చేపట్టారు. ఏటేటా ఆసరా పింఛన్లు పెంచేందుకు కొత్త మేనిఫెస్టో రూపొందించారని ఓటర్లకు వివరించారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన ప్రతి ఇంటికి రైతు బీమా తరహాలో జీవిత బీమా రూ.5 లక్షలు కల్పిస్తారన్నారు. బీజేపీ హయంలో పెరిగిన వంట గ్యాస్‌తో మహిళలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రూ. 400కే బీఆర్‌ఎస్‌ గ్యాస్‌ సిలిండర్‌ను అందిస్తుందని తెలిపారు.

దామరగిద్ద: అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డిని గెలిపించుకుందామని మండల బీఆర్‌ఎస్‌ శ్రేణులు ప్రచారం చేశారు. ఆదివారం మండలంలోని దామరగిద్ద, కాన్‌కుర్తి, మల్‌రెడ్డిపల్లి, లోకూర్తి, మద్దెల్‌బీడ్‌, క్యాతన్‌పల్లి, మొగుల్‌మడ్క, సజనాపూర్‌ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి కారుగుర్తుకు ఓటేయ్యాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సప్ప, ఈదప్ప, భీమయ్యగౌడ్‌, కిషన్‌రావ్‌, వెంకట్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శరణప్ప, చంద్రకాంత్‌, బసంత్‌రాజ్‌, అశోక్‌గౌడ్‌, కన్కిరెడ్డి మాణిక్యప్ప పాల్గొన్నారు.

ముగిసిన ప్రతిష్ఠాపన ఉత్సవాలు



గండేడ్‌: మండలంలోని వెన్నాచేడ్‌లో మూడురోజులుగా చేస్తున్న బొడ్రాయి, ధ్వజస్తంభ, విగ్రహాల ప్రతిష్ఠాపన ఉత్సవాలు ముగిశాయి. ఆదివారం నర్సింహస్వామి, హనుమాన్‌, శివాలయం ఆలయాల ఎదుట ధ్వజస్తంభ, ఎల్లమ్మ, పోచమ్మ విగ్రహాల ప్రతిష్ట, గ్రామంలో 9 కూడళ్లలో బొడ్రాయి ప్రతిష్ట కార్యక్రమాలను పూర్తి చేశారు. చెరువు నుండి 108 కలశాలతో జలాభిషేకం నిర్వహించారు. సాయంత్రం బోనాల ప్రదక్షిణ చేశారు. గ్రామస్తులు సామూహిక భోజనం చేశారు. మూడు రోజుల పాటు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గ్రామస్తులు వేలాది సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌ పుల్లారెడ్డి, అనంతలక్ష్మారెడ్డి, అనంతసేనారెడ్డి, గోపాల్‌, రాంరెడ్డి, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి

జడ్చర్ల టౌన్‌: ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి పురస్కరించుకుని సంస్కార భారతి ఆధ్వర్యంలో ఆదివారం నివాళి అర్పించారు. పట్టణంలోని అనురాగిణి అరక్షిత నిలయంలో చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సంస్కార భారతి సభ్యులు పాల్గొన్నారు.

దేవుడిపై కృతజ్ఞతగా ఉండి రాణించాలి



కృతజ్ఞతార్పణ పండుగ వేడుకల్లో క్రైస్తవులు

స్టేషన్‌ మహబూబ్‌నగర్‌: ఏసు ప్రభువు నిత్యం ఏదో ఒక మేలు చేసే గొప్ప దేవుడని, ఇందుకు మనమంతా ఆయనకు తిరిగి కృతజ్ఞత చెల్లించేగా వారిగా ఉండాలని అంతర్జాతీయ ముఖ్య ప్రసంగీకులు రెవ.బీఎస్‌ పరంజ్యోతి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఏనుగొండ సమీపంలోని రెమా వర్షిప్‌ సెంటర్‌లో డైరెక్టర్‌ బీఎస్‌.పరంజ్యోతి అధ్యక్షతన ఆదివారం కృతజ్ఞతార్పణ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ మనం భూమి మీద జన్మించినప్పటి నుంచి నిత్యం దేవుని ద్వారా మేలుల్ని పొందుతూనే ఉంటామని, ఇందుకు దేవుడు మన నుంచి కేవలం కృతజ్ఞతను మాత్రమే ఆశిస్తాడన్నారు. ఈ విషయాన్ని ప్రతి విశ్వాసి గుర్తుంచుకోవాలని కోరారు. అనంతరం పరిశుద్ధ బైబిల్‌లోని కొందరి వ్యక్తుల జీవితాల్ని విశ్వాసులకు వివరిస్తూ, కృతజ్ఞత ప్రత్యేకతను తెలియజేసేందుకే ఏడాదికోసారి ఈ పండుగల్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఆకట్టుకున్న వేలం పాట..

కృతజ్ఞతార్పణల పండుగ సందర్భంగా విశ్వాసులు స్వయంగా తయారు చేసుకొని వచ్చిన పిండి వంటలు, ఇతరత్రా ప్రత్యేకత కలిగిన పండ్లకు వేలం పాట నిర్వహించారు. పోటీ పడి కొనుగోలు చేయడంతో అందర్ని ఆకటుకున్నాయి. కార్యక్రమంలో పాస్టర్లు మోహన్‌, తిమోతి, వేదాంతి, సంఘ పెద్దలు దేవయ్య, లక్ష్మన్న, అనిల్‌, స్వామి, రామంజనేయులు, సిస్టర్స్‌ బ్లాండీనా, ప్రైయిజీ రాణి, మేరి, మహిమతోపాటు అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

జడ్చర్ల నియోజకవర్గ ఓటర్లు 2,20,244



జడ్చర్ల టౌన్‌: సాధారణ ఎన్నికల్లో అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,20,244కు చేరింది. అక్టోబర్‌ 30నాటికి ఓటరు నమోదు పూర్తి కావటంతో క్రితం ఓటర్ల కన్నా దాదాపు 8వేలు పెరగటం గమనార్హం. ఓటర్లలో పురుషులు 1,10,783, మహిళలు 1,09,456 ఉండగా ఇతరులు ఐదుగురు ఉన్నారు. ఎన్నికల షెడ్యూల్‌ విడుదలైన అక్టోబర్‌ రెండవ వారంలో నియోజకవర్గంలో 2,12,394మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 1,06,922 మహిళలు 1,05,469, ఇతరులు నలుగురు ఉన్నారు. నియోజకవర్గంలో గుట్టకాడితండా పోలింగ్‌బూత్‌లో అత్యల్పంగా 287మంది ఓటర్లు ఉండగా అత్యధికంగా మున్సిపాలిటీ పరిధిలోని 172వ పోలింగ్‌ బూత్‌లో 1,328 మంది ఉన్నారు.

నియోజకవర్గంలో మండలాల వారీగా ఓటర్ల వివరాలు

మండలం	పోలింగ్‌ కేంద్రాలు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
నవాబుపేట	53	20,281	19,672	0	39,953
రాజాపూర్‌	26	10,984	10,980	0	21,964
బాలానగర్‌	39	16,540	15,882	1	32,423
జడ్చర్ల	103	42,157	42,216	4	84,377
మిడ్జిల్‌	31	12,177	12,080	0	24,257
ఊర్కొండ	22	8,644	8,626	0	17,270